## అప్రెంటిస్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4: ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అప్రెంటిస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మధార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 31 వరకు దరఖాస్తు సమర్పించాలని ఆయన సూచించారు.

## సీఎం కప్ పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలకు ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయితీల్లో ఈ నెల 7,8న, మండల స్థాయిలో 10, 11న, జిల్లా స్థాయిలో 16 నుంచి 21 వరకు ఈ పోటీలు జరుగుతాయని వివరించారు.

## రాజేంద్రనాథ్‌కు డాక్టరేట్



కురవి(సీరోలు), డిసెంబర్ 4: సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్ తండాకు చెందిన బానోత్ బిచ్యానాయక్–భారతిల కుమారుడు రాజేంద్రనాథ్ నల్గొండ జిల్లా మహాత్మాగాంధీ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ అందుకున్నారు. ఆయన హైదరాబాద్‌లోని టీకేఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఐసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ప్రొఫెసర్ శ్రీలక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనాథ్‌ను కుటుంబ సభ్యులు, తండావాసులు అభినందించారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

నెల్లికుదురు, డిసెంబర్ 4 : సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మెసెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రత్నపురపు యాకయ్య కోరారు. ఈ మేరకు ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే రిలే దీక్ష, సమ్మె నోటీసును బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో భోజన విరామ సమయంలో ఎంఈవోకు అందజేశారు. ఐఈఆర్పీ పెరుమాండ్ల యాకయ్య, కంప్యూటర్ ఆపరేటర్ హెచ్ ఉపేందర్, సీఆర్పీలు బీ వీరస్వామి, బీ కవిత, జే కవిత పాల్గొన్నారు.

## సేవాలాల్ మందిరానికి స్థలం కేటాయించాలి

బయ్యారం డిసెంబర్ 4 : సేవాలాల్ మహరాజ్ మందిరం నిర్మాణం, గిరిజన భవన్ కోసం 20 గుంటల ప్రభుత్వ స్థలం కేటాయించాలని సేవాలాల్ సేన బాధ్యులు కోరారు. ఈ మేరు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సునీల్ నాయక్, వీరన్న నాయక్, రమేశ్ నాయక్, మాజీ ఎంపీటీసీ మంగీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Urgently Required Junior lecturers for Biology and Physics for Shaheen Junior college at Mulugu X Road, Hanumakonda. Contact Ph: 8374999474, 8374999475

NTW-000

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.

NTW-326503

గమనిక


క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565


# నర్సరీ మొక్కలపై గొడ్డలి వేటు !

- కనిపించకుండా కాల్చివేత
- నర్సింహులపేట నర్సరీలో ఘటన
- అధికారుల తీరుపై స్థానిక ప్రజల ఆగ్రహం

నర్సింహులపేట, డిసెంబర్ 4 : వనమహోత్సవం, పచ్చదనం, స్వచ్ఛదనం పేరుతో రూ.లక్షలు ఖర్చు చేసి నాటిన మొక్కలను నరికి, కనిపించకుండా కాల్చివేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని హరితహారం నర్సరీలో ఉన్న సుమారు 2 వేల మొక్కలను నరికి, కాల్చివేశారు. దీనిపై స్థానిక ప్రజలు మండి పడుతున్నారు. మొక్కలను పెంచి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులే మొక్కలు నరికి వేసి, కాల్చి వేయడం సరి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖాధికారుల అనుమతులు లేనిది రైతులు సైతం చెట్లు నరకవద్దని చెప్పే అధికారులు, ఇలా మొక్కలను నరికి, కాల్చి వేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



నర్సింహులపేట నర్సరీలో కాలిపోయిన మొక్కలు, (ఇన్‌సెట్‌లో) చెట్లను నరికి, కొమ్మలతో ఏర్పాటు చేసిన కంచె

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కొత్తగూడ, డిసెంబర్ 4 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన ఎంచగూడెం శివారులో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని సాధిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జిట్టబోయిన సమ్మయ్య ఎంచగూడెం శివారులోని వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా అదుపు తప్పి కిందపడిపోయింది. దీంతో సమ్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఆటోకు బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

కురవి, డిసెంబర్ 4 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన కురవిలోని 365 జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం శివారు ఆనందపురానికి చెందిన జినక శ్రీను మహబూబాబాద్ నుంచి కురవి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అదే మార్గంలో కురవి వైపు వెళ్తున్న ఓ ఆటో స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ కారణంగా స్లో కాగానే, అదుపు తప్పిన ద్విచక్రవాహనం ఆటోను వెనుక నుంచి ఢీకొంది. దీంతో శ్రీను కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కురవి పోలీసులు శ్రీనును మానుకోట ఏరియా దవాఖానకు తరలించారు.

## ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4 : ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల శివారులోని జమాండ్లపల్లిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకున్నది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సిలివేరు రాములు–స్వరూపల కుమారుడు ఉదయ్‌కిరణ్(21) పట్టణంలోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. బుధవారం అతడు ఇంటి వద్దనే ఉండగా తల్లిదండ్రులు పొలం వద్దకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇంటి పక్కన ఉన్న వారు చూసి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. యువకుడి మృతితో కాలనీలో విషాదం నెలకొంది.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యా నాయక్

## బాధిత కుటుంబానికి రెడ్యా పరామర్శ

డోర్నకల్, డిసెంబర్ 4 : కొత్త దుబ్బ తండా మాజీ ఉప సర్పంచ్ తేజావత్ భారతి భర్త తేజావత్ వస్రం(60) బుధవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యా నాయక్ పరామర్శించారు. వస్రం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరశాల విద్యా సాగర్, మాజీ ఎంపీటీసీ బానోత్ శంకర్ కోటి, మాజీ సర్పంచ్ బాదావత్ బాలాజీ, బీఆర్ఎస్ నాయకులు బానోత్ మంగీలాల్ ఉన్నారు.



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4 : మున్సిపల్ పరిధి 17వ వార్డు కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో సీఎం ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ పట్టణంలోని పేదలు 20 ఏళ్లుగా కాలనీని నిర్మించుకుని అక్కడ ఉంటున్నారన్నారు. ఇంత వరకు కాలనీకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించలేదన్నారు. పక్కా భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కాలనీకి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పులి శ్రీను, గుట్టయ్య, రాధ, సుధారాణి, ఉపేందర్, బాలరాజు, భాను పాల్గొన్నారు. కాగా, మున్సిపల్ పరిధి ధర్మన్న కాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీ అజయ్ సారథి డిమాండ్ చేశారు. బుధవారం కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, నవీన్, శంకర్, రవీందర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

## మహిళలకు రక్షణ కరువు

కొత్తగూడ, డిసెంబర్ 4 : మహిళలకు రక్షణ కరువైందని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. కొత్తగూడలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బుధవారం బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తాత్కాలిక ప్రిన్సిపాల్ లలిత, విద్యార్థులు, కేంద్రం సిబ్బంది సౌజన్య, సంధ్యారాణి పాల్గొన్నారు.



నెల్లికుదురులో అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేశ్ బాబు

## సైబర్ నేరాలపై అవగాహన

నెల్లికుదురు, డిసెంబర్ 4 : మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సైబర్ నేరాలపై బుధవారం స్థానిక ఎస్సై చిర్ర రమేశ్ బాబు ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భూకంపం.. ఉలిక్కిపడిన జనం..

- రోడ్లపైకి వచ్చిన ప్రజలు
- ఎక్కడ చూసినా ఇదే చర్చ

మహబూబాబాద్ రూరల్/కురవి/డోర్నకల్/గంగారం/దంతాపల్లి/ నెల్లికుదురు/ మరిపెడ, డిసెంబర్ 4 : జిల్లాలో భూకంపంతో జనం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఉదయం 7.30 ప్రాంతంలో స్వల్పంగా భూమి కంపించడంతో గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందారు. వెంటనే భయపడి ఇండ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. మండలంలో బుధవారం ఉదయం 7–30 నిమిషాలకు పలు చోట్ల కొన్ని సెకండ్ల పాటు భూమి కంపించింది. ప్రధానంగా కంబాలపల్లి, బేతోలు, జమాండ్లపల్లి, నడివాడ, శనిగపురం, రెడ్యాల గ్రామాలతో పాటుగా పట్టణంలోని రామచంద్రాపురం కాలనీ, హస్తినాపురం, కొత్త బజారులోని కొన్ని ఏరియాలతో పాటు డోర్నకల్, సీరోలు, గంగారం, దంతాలపల్లి, నెల్లికుదురు, మరిపెడ మండలాల్లో కూడా ప్రజలు ఆందోళన చెందారు. కేసముద్రంతోపాటు చిన్నగూడూరు మండలం జయ్యారంలో ఇండ్ల గోడలు స్వలంగా బీటలువారాయి.

# పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం : ఎమ్మెల్యే యశస్విని

తొర్రూరు, డిసెంబర్ 4 : పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో రాయపర్తి, పెద్ద వంగర, తొర్రూరు మండలాలకు చెందిన 54 మంది లబ్ధిదారులకు రూ.17.3లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజలందరికీ సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే, మిషన్ భగీరథ గెస్ట్‌హౌస్‌లో విద్యుత్ శాఖ తొర్రూరు డీఈ మధుసూదన్, ఏడీఈ చలపతిరావుతో పాటు విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాల్లో విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, ఐఎన్‌టీయూసీ 327 తరపున నూతనంగా ఎన్నికైన డివిజన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఏఈలు జయప్రకాశ్ నారాయణ, మహేశ్, నాయకులు నిరంజన్‌రెడ్డి, హామ్యానాయక్, సోమశేఖర్, సంతోష్, రవీందర్‌రెడ్డి, సురేశ్, మురళి, గోపాల్‌నాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



తొర్రూరులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

# గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే మురళీనాయక్

ఇనుగుర్తి, డిసెంబర్ 4 : మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగిన ప్రజాపాలన ప్రజావిజయోత్సవ సభకు బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మండలంలోని లాలుతండా నుంచి విడిపోయి నూతనంగా ఏర్పాటైన రాముతండా జీపీని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. కాగా, సభలో ఇనుగుర్తి గ్రామంలో అభివృద్ధి పనులకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.25లక్షలు మంజూరు చేశారని, ఎమ్మెల్యే కూడా మరో రూ.25లక్షలు మంజూరు చేయాలని, ఎంఈవో కార్యాలయానికి రూ.10లక్షలు మంజూరు చేయాలని, ఎంపీడీవో కార్యాలయం కోసం వద్దిరాజు రవిచంద్ర రూ.50లక్షలు మంజూరు చేశారని, కానీ, ఆ భూమి దేవాదాయశాఖ పరిధిలో ఉందని, వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతూ మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కాగా, విజయోత్సవ సభ గురించి తమకు సమాచారం ఇవ్వలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుజ్జునూరి బాబురావు, మలిశెట్టి శ్యామ్ కాసేపు వాదించారు. ఎస్సై మురళీధర్‌రాజ్ వారిని బుజ్జగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, ఎంపీవో హరిప్రసాద్, డీటీ ఆకుల రవి, ఏవో భూక్యా మహేందర్, ఐవోబీ మేనేజర్ రమేశ్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, ఏఈవో భాస్కర్ పాల్గొన్నారు.



రాముతండా జీపీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

## 'ఆశ వర్కర్లకు రూ.18 వేలు వేతనం ఇవ్వాలి'

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4 : ఆశ వర్కర్లకు రూ.18 వేల వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెప్రసీ, పల్స్ పోలియో సర్వే కార్యక్రమాల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజమౌళి, నాగన్న, ఉపేంద్ర, సుజిత, సునీత, నళిని, విజయ, జ్యోతి, రామాదేవి, పుష్ప పాల్గొన్నారు.



నెల్లికుదురు : నర్సింహులగూడెంలో నాస్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రాందాస్

## ప్రశాంతంగా ముగిసిన నాస్ పరీక్ష

మహబూబాబాద్ రూరల్/నెల్లికుదురు, డిసెంబర్ 4 : విద్యార్థుల అభ్యసన స్థాయి ఫలితాలను తెలుకోవడానికి నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్) పరీక్ష జిల్లాలో ప్రశాతంగా ముగిసినట్లు డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన 73 పాఠశాలల్లో 3,6,9వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా కోఆర్డినేటర్లు, జెండర్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్లు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. కాగా, నెల్లికుదురు మండలంలోని నర్సింహులగూడెం ప్రాథమికోన్నత, జామాతంలో ప్రాథమిక పాఠశాల, మేచరాజుపల్లి, నెల్లికుదురులోని ఉన్నత పాఠశాలల్లో పరీక్షలను ఎంఈవో రాందాస్ పరిశీలించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, హెచ్ఎంలు మంగతాయి, జీవన్ కుమార్, ఉపేందర్ రావు, పద్మావతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

## 'గురుకులాలను గాలికొదిలిన కాంగ్రెస్ ప్రభుత్వం'

కేసముద్రం, డిసెంబర్ 4 : పేద విద్యార్థులు చదువుకునే గురుకుల పాఠశాలలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ గుగులోత్ సూర్యప్రకాశ్ ఆరోపించారు. కల్వల మోడల్ స్కూల్‌లో బుధవారం సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు నిర్వాహకులు నాసిరకం భోజనం అందిస్తున్నారన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటన పునరావృతం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో భూక్యా రాజేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## 'కొనుగోళ్లలో తరుగును అరికట్టాలి'

కేసముద్రం, డిసెంబర్ 4 : ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో ట్రాక్టర్‌కు 30 కేజీలు తీయడాన్ని అరికట్టాలని జైకిసాన్ రైతు పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు సంకపల్లి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం మార్కెట్ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ట్రాక్టర్లలో విక్రయానికి తీసుకొచ్చిన ధాన్యానికి వ్యాపారులు వేబ్రిడ్జి కాంటా నిర్వహించి, తరుగు పేరుతో 30 కేజీలకు పైగా తీయడం వలన నష్టం కలుగుతోందన్నారు. రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తరుగును నిరోధించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మూల భూలోక్‌రెడ్డి, కొమ్మాల జహిందర్‌రెడ్డి గండి శ్రీనివాస్, వంగాల కొమ్మాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## బాలికల భద్రతే షీ టీం లక్ష్యం

కేసముద్రం, డిసెంబర్ 4 : బాలికలు, మహిళలను రక్షించడమే షీ టీం లక్ష్యమని షీ టీం ఎస్సై సునంద అన్నారు. మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌లో షీ టీం, సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు క్రమ శిక్షణ ఉంటూ, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్, షీ టీం సభ్యులు అరుణ, రమేశ్, సుప్రజ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శిరీష పాల్గొన్నారు.

# చింత కల్లు.. టేస్ట్ అదుర్స్..

కొత్తగూడ, డిసెంబర్ 4: మండలంలో విచిత్ర ఘటన చోటుచేసుకుంది. తాటి, ఈత, వేప చెట్లకు కల్లు రావడం అందరికీ తెలిసిన విషయమే. కానీ, భిన్నంగా ఓ చింత చెట్టుకు కల్లు పారుతోంది. కొత్తగూడంలోని వేలుబెల్లి పంచాయతీ సమీపంలోని పోచమ్మగుడి దగ్గరున్న చింత చెట్టుకు కల్లు పారుతోంది. ఈ వార్త సంచలనంగా మారింది. విషయం తెలుసుకున్న జనం చూసేందుకు తరలివస్తున్నారు. కల్లు రుచి చూసి, బాగుందని అంటున్నారు.



చింత చెట్టుకు వస్తున్న కల్లును చూసేందుకు వస్తున్న ప్రజలు

## కేసీఆర్‌ను కలిసిన సంకినేని కిరణ్

నెల్లికుదురు, డిసెంబర్ 4 : మండలంలోని కాచికల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సంకినేని కిరణ్ బుధవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పుష్ప గుచ్ఛం అందజేశారు.



కేసీఆర్‌తో కిరణ్



పశువులకు వైద్య చికిత్స అందిస్తున్న అధికారులు

## మేలు జాతి దూడల ప్రదర్శన

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4 : మండల పరిధిలోని అమనగల్ గ్రామంలో బుధవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేలు జాతి దూడల ప్రదర్శన, ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యనిర్వహణ అధికారి డాక్టర్ రఘు బాబు హాజరై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ అశోక్, నాగేశ్వర్ రావు 167 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉత్తమ పాడి రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవో రేవతి, ఎల్ఎస్ఏ రాంప్రసాద్, సంధ్య, ఏరియా గోపాల మిత్ర సూపర్‌వైజర్ రఘువీర్, గోపాల మిత్రులు కృష్ణ, అశోక్, సుధాకర్, శంకర్, యాకూబ్, సంతోష్, సత్యనారాయణ, కుమారస్వామి పాల్గొన్నారు.



భిక్ష చేస్తున్న అయ్యప్ప, వీరభద్రస్వాములు

## మాజీ మంత్రి సహకారంతో భిక్ష

కురవి, డిసెంబర్ 4 : మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సహకారంతో మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్‌హాల్‌లో అయ్యప్ప, వీరభద్రస్వాములకు బుధవారం భిక్ష(అన్న ప్రసాదం) ఏర్పాటు చేశారు. గురుస్వామి బాదె నాగయ్య ఆధ్వర్యంలో స్వామివారి పూజ అనంతరం 54 మంది స్వాములకు భిక్ష అందించారు. కార్యక్రమంలో గురుస్వాములు చదువుల సాంబయ్య, కోనేటి వీరన్న, ఓం ప్రకాశ్, బీ రమేశ్, ఎన్ మహేశ్, వీరన్న, చిలుకల సంతోష్, రమేశ్, అశోక్, మహేశ్, వీరభద్ర స్వాములు గురుమూర్తి, వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు గుగులోత్ నెహ్రూ, అల్లూరి కిశోర్ వర్మ, బోడ శ్రీను, చిలుముల సంతోష్, సంపత్ పాల్గొన్నారు.

## 'అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి'

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4 : మానుకోట ఆర్టీసీ డిపోకు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న కోరారు. బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. మహాలక్ష్మి పథకం వల్ల ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిందని, జిల్లాలోని అన్ని మండల కేంద్రాలను కలుపుకుని ఆర్టీసీ బస్సులు నడిచేలా చూడాలని కోరారు. ఈ నెల 9న హైదరాబాద్ ఆర్టీసీ బస్ భవన్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవి, ప్రభాకర్, వీరన్న, సూర్యం, సత్యం, పైండ్ల యాకయ్య, వెంకన్న, రాజు, లింగస్వామి పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న దివ్యాంగుడు దడిగెల రిషిక్

## ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

కురవి, డిసెంబర్ 4 : మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ)లో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎమ్మార్సీలో ప్రతి బుధవారం దివ్యాంగులకు నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంపులో కేక్ కట్ చేసి, సంబురాలు చేసుకున్నారు. దివ్యాంగులకు ఆటలపోటీలు పెట్టి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ నిషాంత్, సిబ్బంది వీరేందర్, ప్రభాకర్, విజయలక్ష్మి, రాజేశ్ పాల్గొన్నారు.

## 'పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి'

కురవి, డిసెంబర్ 4 : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురవి మండల కమిటీ సమావేశం రాయల మనోహర్ అధ్యక్షతన బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రకటించి, అధికారంలో వచ్చిన తర్వాత చిత్తశుద్ధితో అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆకుల రాజు, మండల కార్యదర్శి మలేడి కోటయ్య, పిట్టల వెంకన్న, కడియం సత్యం, జక్కుల మల్లయ్య, నాళం వెంకన్న, పోతుగంటి మల్లయ్య, మాలోత్ కిషన్, తగరం తిరుపతి, కట్ల కృష్ణయ్య, కొమ్ము మంజుల పాల్గొన్నారు.

## 'పర్యావరణ విధ్వంసం వల్లే భూకంపాలు'

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4 : పర్యావరణాన్ని విధ్వంసం చేయడం వల్లే భూకంపాలు సంభవిస్తున్నాయని నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలీమ తెలిపారు. బుధవారం పట్టణంలో ప్లకార్డులు పట్టుకుని పురవీధుల్లో తిరుగుతూ ప్రచారం చేశారు. ఇప్పటికైనా విస్తృతంగా మొక్కలను నాటి సంరక్షించుకోవాలని కోరారు.

## జీవ వైవిధ్యాన్ని సంరక్షించుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 4 : అంతరించిపోతున్న జీవ వైవిధ్యాన్ని ప్రతి ఒక్కరూ సంరక్షించాలని హరిత మిత్ర అవార్డు గ్రహీత, ప్రజా హృదయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు దైద వెంకన్న అన్నారు. బుధవారం పట్టణంలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పొందాలంటే అడవుల నరికివేతను అరికట్టాలన్నారు. వన్య ప్రాణులను కాపాడుతూ వాయు కాలుష్యం తగ్గించాలన్నారు. ఇప్పటి వరకు అమ్మ పేరుతో 500 మొక్కలను నాటించినట్లు వివరించారు.